3-8-2000 ఆంధ్రప్రభ

# శివసేనానికి శిక్షపడుతుందా?

**జస్టిస్ శ్రీకృష్ణ తన వ్యక్తిగతజీవితంలో చాలా సాంప్రదాయిక ఆచారాలు పాటించే హిందువు. అయితే చట్టబద్ధపాలన ఉండాలన్న ఆరాటం, చట్టానికి ఎవరూ అతీతులు కాకూడదన్న సంకల్పం ఆయనలో ఉండడం వల్ల చాలా నిర్మొగమాటంగా శివసేననూ, శివసేనకు గులాములుగా పనిచేసిన ముంబాయి పోలీసులనూ ఆయన తప్పుపట్టారు. నిర్మొగమాటంగానే కాదు, సవివరంగా వారినేరాలను ఏకరవు పెట్టారు. శ్రీకృష్ణ కమిషన్ నివేదికను అమలు చేయగలిగిన నాడు భారతదేశంలో నిజంగా చట్టబద్ధపాలన ఉందని చెప్పుకోగలుగుతాం.**



కె.బాలగోపాల్

బాల్‌థాకరే పైన ముంబాయి పోలీసులు లేక లేక పెట్టిన ఒక్క కేసును మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు తొలిదశలోనే కొట్టేయడం చట్టబద్ధమేనా?

992 డిసెంబర్—93 జనవరినెలలో ముంబాయిలో శివసేన మూకలు పాల్పడిన అల్లర్లకుగాను పోలీస్ స్టేషన్లలో నమోదయిన 11 వేల కేసులను ప్రభుత్వమే వెనక్కి తీసుకోగా లేనిది, మిగిలి పోయిన ఒక్క కేసును కోర్టు కొట్టేస్తే ఏమనవచ్చు. ప్రభుత్వాలు ఏమవారిని కాపాడుకునే వైఖరి ప్రదర్శించినా న్యాయస్థానాలు సమభావం పాటించాలన్న విలువ ఒకటి ఉంది కాబట్టి, అది ప్రజాస్వామ్యం మనుగడకు చాలా అవసరం కాబట్టి, అట్లా అనుకోవడానికి వీలులేదు.

బాల్‌థాకరే పైన ఆ కేసు పెట్టింది ఎనిమిది లేక ఏడేళ్లకింద. భిన్న మతాలకు చెందిన ప్రజల మధ్య విద్వేషం రెచ్చగొట్టే రాతలు చేస్తున్న ఆ అభియోగం ఐపిసిలోని సెక్షన్ 153—ఎ కిందికి వస్తుంది. ఆ నేరానికి గరిష్ఠ శిక్ష 3 సంవత్సరాలు. 3 సంవత్సరాల గరిష్ఠ శిక్షగల నేరంపైన విచారణ, ఆ నేరం వెలుగులోకి వచ్చిన తరువాత మూడేళ్లలోపల మొదలు పెట్టాలనీ, మూడేళ్లు దాటిన తరువాత విచారణ చేపట్టడానికి వీలులేదనీ సిఆర్‌పిసి లోని సెక్షన్ 468 అంటుంది. కాబట్టి ఏడేళ్లు గడచిన తరువాత ముద్దాయిని తమముందు ప్రవేశపెడితే మేజిస్ట్రేటు అతనిని డిశ్చార్జ్ చేయక తప్పుతుందా? అని అడుగుతున్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసం ఈ కేసును మహారాష్ట్ర ప్రభుత్వం దుమ్ముదులిపి బయటకు తీయడాన్ని విమర్శించాలిగానీ, మేజిస్ట్రేటును ఏమని విమర్శిస్తామని అంటున్నారు. పైగా, రాంజెత్మలానీ ఈ సంగతి ముందే చెప్పారు కదా అని గుర్తు చేస్తున్నారు.

పైకి సహేతుకంగా కనిపించే ఈ వాదన నిజానికి సహేతుకమైనదికాదు.

సెక్షన్ 468లోని కాలపరిమితిని తప్పనిసరిగా శిరసావహించాలని లేదు. 'ఆలస్యానికి సబబయిన కారణం ఉందని' భావించినా లేక 'న్యాయాన్ని కాపాడడానికి అవసరమని' భావించినా సెక్షన్ 468 లోని కాలపరిమితిని దాటి కూడా విచారణ చేపట్టవచ్చునని సెక్షన్ 473 అంటుంది.

ఆలస్యానికి సబబయిన కారణం ఉందని చూపించవలసింది ప్రభుత్వం. దానికి ప్రభుత్వం శ్రద్ధ పెట్టుకోవాలి, వాదించి కోర్టువారిని సంతృప్తి పరచాలి, కానీ ఆ అవకాశమే ప్రభుత్వానికి ఇవ్వకుండా మేజిస్ట్రేటు ముద్దాయి తన ముందుకు రాగానే డిశ్చార్జి చేసేస్తే ఎట్లా? చట్టమే మినహాయింపు పెట్టిన సెక్షన్ 468ని కోర్టు మినహాయింపు లేని శాసనంగా మార్చి వేయడం సబబు కాదు.

అదిపోనిచ్చి, 'న్యాయాన్ని నిలబెట్టడానికి' (ఇన్ ది ఇంటరెస్ట్ ఆఫ్ జస్టిస్) బాల్‌థాకరే విషయంలో మూడు సంవత్సరాల నియమానికి మినహాయింపు ఇవ్వడమే సబబని ఆ మేజిస్ట్రేట్ ఎందుకు అనుకోలేకపోయారు? థాకరే దేశంలోని అతిమాదకరమైన టెర్రరిస్టు. టెర్రరిస్టులందరినీ ఒకేగాటన కట్టవచ్చునని కొంచెంసేపు అనుకున్నా, తక్కిన టెరరిస్టులు సమాజంలో ఒక మైనారిటీని రెచ్చగొట్టి తమప్రయోజనాలు సాధించుకుంటారు. థాకరే మెజారిటీని రెచ్చగొడతాడు. తక్కిన టెర్రరిస్టులు ఇక్కడా అక్కడా దాక్కొని పోలీసుల కళ్లుగప్పి తమ కార్యకలాపాలు సాగిస్తారు. థాకరే



ముంబాయి మహానగరంలో దర్జాగా కాలిమీద కాలువేసుకొని పట్టపగలే చీకటి రాజ్యం నడుపుతాడు. అరుణ్‌గావ్లీ జైలు నుండి తమ మాఫియా నడుస్తున్నాడనీ, దావూద్ ఇబ్రహీం కరాచీలోనో మరెక్కడో ఉండినడుపుతాడనీ ముంబాయి నగర మాఫియాల ప్రస్తావన వచ్చినప్పుడు వింతగా చెప్పుకుంటుంటారు. కానీ నగరం నడిబొడ్డున బంగ్లా కట్టుకొని బహిరంగంగానే మాఫియానడిపే శివసేన అధినేత గురించి ఏం చెప్పుకోవాలి? శివసేన కంటె ప్రమాదకరమైన మాఫియా ముంబాయిలో వేరే ఏదుంది?

ఈ విషయాన్ని ఆ మేజిస్ట్రేట్ గతం నుంచి గ్రహించకున్నా వర్తమానం నుండి గ్రహించి ఉండవచ్చును. థాకరేని అరెస్టుచేస్తే బొంబాయి తగలబడుతుందని అతని పార్టీవారు చేస్తున్న ప్రకటనలు, ఆరోజు ముందు జాగ్రత్తగా ముంబాయి ప్రజలు ఎవరి ఇళ్లల్లోవారు ఉండిపోయారన్న వార్తలు, కేంద్రం సిఆర్‌పిఎఫ్ బలగాలను ముంబాయికి తరలించనుందన్న వదంతులు, ఇవయినా ఆ మేజిస్ట్రేట్‌కు బాల్‌థాకరే విషయంలో 'మూడు సంవత్సరాల గడువు'కు మినహాయింపు ఇవ్వడం న్యాయాన్ని నిలబెట్టడానికి అవసరం అని తెలిపి ఉండాలి.

ఇంకొంచెం సాంకేతికంగ్గా చూసినట్టయితే, సెక్షన్ 468లో ఉన్న గడువు నేర విచారణ చేపట్టడానికి ('కాగ్నిజన్స్' తీసుకోవడానికి) చట్టం పెట్టిన గడువే తప్ప ప్రాథమిక ఆధారాలమీద ముద్దాయిని రిమాండ్‌చేసే అధికారానికి పెట్టిన కాలపరిమితికాదు. నేరవిచారణే మూడేళ్లు దాటిన తరువాత చేపట్టలేనప్పుడు రిమాండ్ చేసి ఏం ప్రయోజనం అని అడగవచ్చు. కానీ ముద్దాయిని ఏ సెక్షన్ కింద రిమాండ్ చేస్తారో, చివరికి విచారణ ఆ సెక్షన్ కిందే జరగాలన్న నియమంలేదు. రెచ్చగొట్టే రాతలు రాసాడన్న అభియోగం మీద అరెస్టు చేయొచ్చు. కానీ ఆనేరాన్ని పరిశోధించే క్రమంలో ఆ రాతల ఫలితంగా దొమ్మీలు జరిగాయని తేలితే ఆ రాతలు పెద్దనేరంలో భాగమవుతాయి. మూడు సంవత్సరాల కంటె ఎక్కువ శిక్షగల నేరాల విచారణకు ఏ కాలపరిమితీ లేదు కాబట్టి అదే నిజమయితే ఆ నేరాన్ని పది సంవత్సరాల తరువాతయినా విచారించవచ్చు.

అందువల్ల రిమాండుకోసం ముద్దాయిని మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టినప్పుడు, అది మూడేళ్ల శిక్షగల నేరమే కాబట్టి, నేరం జరిగి మూడేళ్లు గడిచిపోయాయి కాబట్టి డిశ్చార్జ్ చేసేస్తాననడం సరయినదికాదు. మహారాష్ట్ర ప్రభుత్వం బాల్‌థాకరే డిశ్చార్జ్ ఆర్డర్‌పైన హైకోర్టుకు పోతానని ప్రకటించింది. హైకోర్టు కొంచెం ఎక్కువ విజ్ఞత ప్రదర్శిస్తుందని ఆశిద్దాం.

అయితే ఈ ఒక్కకేసు గతి ఏమవుతుందనే దానికంటె సుప్రీంకోర్టు ముందున్న 'శ్రీకృష్ణ కమిషన్ కేసు' ఏ రూపంతీసుకుంటుందనేది చాలా ముఖ్యమైన విషయం. చాలా నిర్భయంగా నిజాయితీగా చేసిన కొన్ని న్యాయవిచారణలలో అదొకటి. జస్టిస్ శ్రీ కృష్ణ తన వ్యక్తిగతజీవితంలో చాలా సాంప్రదాయిక ఆచారాలు పాటించే హిందువు. అయితే చట్టబద్ధపాలన ఉండాలన్న ఆరాటం, చట్టానికి ఎవరూ అతీతులు కాకూడదన్న సంకల్పం ఆయనలో ఉండడం వల్ల చాలా నిర్మొగమాటంగా శివసేననూ, శివసేనకు గులాములుగా పనిచేసిన ముంబాయి పోలీసులనూ ఆయన తప్పుపట్టారు. నిర్మొగమాటంగానే కాదు, సవివరంగా వారినేరాలను ఏకరవు పెట్టారు. శ్రీకృష్ణ కమిషన్ నివేదికను అమలు చేయగలిగిన నాడు భారతదేశంలో నిజంగా చట్టబద్ధపాలన ఉందని చెప్పుకోగలుగుతాం. ఆ పని సుప్రీంకోర్టు చేయించగలుగుతుందా? మొదటి మెట్టులోనే, శివసేన ప్రాపకంవల్ల ఎం.పి. అయిన రాంజెత్మలానీ సుప్రీంకోర్టును అల్లరిపాలు చేయడానికి చేసిన ప్రయత్నం చూసాము. నర్మదా బచావో ఆందోళనకారులు ఏదో అన్నారని వారిమీద కోర్టు ధిక్కారం కేసు పెట్టి బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన దేశప్రధాన న్యాయమూర్తి రాంజెత్మలానీని ఏమీ అనకపోవడం గమనార్హం.

ఈ సుప్రీంకోర్టు, ఏడేళ్లనాడు ముంబాయి నగరంలో శివసేన మూకలు పాల్పడిన హత్యాకాండకు ఆ పార్టీ నాయకులనూ కార్యకర్తలనూ బోనెక్కిస్తుందా? వారితో బహిరంగంగా చేయి కలిపిన ముంబాయి నగర పోలీసు అధికారులను బోనెక్కిస్తుందా? లేకపోతే పాముచావని, కర్రవిరగని ఆర్డరేదో జారీ చేసి చేతులు దులుపుకుంటుందా? 11 వేల క్రిమినల్ కేసులను మహారాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్న వైనాన్ని పరిశీలించి ఆ కేసులకు ప్రాణం పోస్తుందా? లేకపోతే ఇంక మీదట ఎప్పుడూ అట్లా జరగకుండా ఉండేందుకు కొన్ని మార్గదర్శక సూత్రాలు ప్రవచించి ఊరుకుంటుందా?

అదే జరిగితే దావూద్ ఇబ్రహీం గురించి మాట్లాడే నైతిక అర్హత ఈదేశానికి లేనట్టే అనుకోవాలి. హిందూ దావూద్ ఇబ్రహీంలను గౌరవనీయ రాజకీయవేత్తలుగా ఆదరించే ఈ దేశానికి, ముస్లిం దావూద్ ఇబ్రహీంలమీద విరుచుకుపడే నైతిక అర్హత ఎక్కడుంది? బాల్‌థాకరే ఫలాన క్రికెట్ మ్యాచ్ జరగడానికి వీలులేదంటే దానిని రద్దుచేస్తూ, ఫలాన సంగీత కచ్చేరీని నేను జరగనివ్వనంటే దానిని 'అనివార్య కారణాల' పేరు చెప్పివాయిదా వేస్తూ, ఫలానా సినిమా ప్రదర్శించడానికి వీలులేదంటే సినిమా ప్రదర్శనలను బంద్ చేస్తూ, ఈ టెర్రరిస్టు గెలిపించిన ఎం.పి.కి దేశ న్యాయశాఖ మంత్రిగా పట్టంగట్టి విదేశీ టెర్రరిస్టుల గురించి ముస్లిం మతవాదుల గురించి ఆవేశంగా మాట్లాడే నైతిక అర్హత మనకెక్కడ ఉంది? అతని ప్రతిమాట, ప్రతిచేష్ట, ప్రతిరాత నేరమే. అతని రాజకీయాల పునాదే నేరం. అతను, అతని పార్టీ ఇవ్వాళ దేశపాలక కూటమిలో భాగం. అతని నేరాలపై అతనిని బోనెక్కించే దమ్ము భారతరాజ్యానికి లేదు. ఈ దుర్గతి నుండి భారత రాజ్యాన్ని కాపాడాలన్న పట్టుదల న్యాయవ్యవస్థకు కూడా లేకపోతే ప్రజాస్వామ్యానికి మనం వేరే నిర్వచనమైనా ఇచ్చుకోవాలి, లేదా దానిని కాపాడడానికి వేరే మార్గాలయినా వెతుక్కోవాలి.